## అపురూపం.. ఆమె విజయం

లక్ష్య సాధనకు పట్టుదల తప్ప వయస్సు అడ్డుకాదని నిరూపించారు భువనగిరి పట్టణానికి చెందిన **మహబూబున్నీసా బేగం.** కుటుంబ బాధ్యతలు మోస్తూనే.. ఉద్యోగ వయో పరిమితి పూర్తయ్యే దశలో హిందీ పండిట్‌గా నల్గొండ జిల్లా పరిధి నుంచి ఎంపికయ్యారు.



★ ఎంఏ, బీఈడీ, హెచ్‌పీటీ పూర్తిచేసి ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా కొనసాగుతున్న ఆమె 51 ఏళ్ల వయస్సులో తన లక్ష్యాన్ని చేరుకున్నారు. దీంతో ఆమె సంతోషానికి అవధులు లేవు. గురుకులం, డీపీఈపీలో ఆరేళ్లపాటు, ప్రైవేటు పాఠశాలల్లో దశాబ్దకాలంగా ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ 2006, 2008, 2014లలో డీఎస్సీ, 2017లో గురుకుల పరీక్ష రాసినప్పటికీ కొద్దిపాటి మార్కుల తేడాతో ఉద్యోగం దక్కలేదు.

★ ఆఖరి ప్రయత్నంగా 2023లో దరఖాస్తు చేసి కుటుంబ బాధ్యతలు మోస్తూనే కష్టపడి చదివారు. నోటిఫికేషన్ వెలువడిన రోజు ఉద్యోగ పరిమితి 44 ఏళ్లు ఉండగా అప్పుడు మరో ఐదు ఏళ్ల పరిమితి ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం మరో రెండేళ్లు పరిమితిని పెంచడంతో ఆఖరి అవకాశంగా మహబూబున్నీసా బేగం ఉద్యోగం సాధించడం గమనార్హం. ఆమె పదేళ్లు ప్రభుత్వ సర్వీస్ పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొందాల్సి ఉంటుంది. – న్యూస్‌టుడే, భువనగిరి పట్టణం

## యాదాద్రిలో సంప్రదాయ ఆరాధనలు

**యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే:** యాదాద్రి పంచనారసింహ స్వామి స్వయంభూ క్షేత్రంలో మంగళవారం నిత్య, సంప్రదాయ ఆరాధనలు ఆలయ శాస్త్రరీత్యా కొనసాగాయి. ఆలయ మూలవరులకు నిజాభిషేకం, తులసీ అర్చన, క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామికి ఆకు పూజ నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను హారతితో కొలిచారు. పంచామృతంతో అభిషేకం చేపట్టారు. దర్శణమూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మహాముఖ మండపంలో స్వర్ణ పుష్పార్చన, అష్టభుజి మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణం నిర్వహించారు. సాయంత్రం అలంకార జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రివేళ గర్భాలయంలో ప్రత్యేక ఆరాధన, సహస్ర నామార్చన నిర్వహించారు. ఉపాలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి వారికి వేద, మంత్రాలతో తమల పాకులతో ఆస్థానపరంగా ఆరాధించారు. ఆర్జిత కైంకర్యాన్ని విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామికి ఆకు పూజ చేపట్టారు. సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలోనూ శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కొలుస్తూ, నిత్యపూజలు నిర్వహించారు.



కల్యాణంలో పాల్గొన్న భక్త దంపతులు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి పుణ్యక్షేత్రంలోని శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలను ఆలయ ఆచారంగా చేపట్టారు. అమ్మవారిని పార్వతీ దేవీ అలంకరణతో తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరోరోజు పర్వత వర్ధిని అలంకారంలో అమ్మవారి దర్శనం, ప్రాతఃకాల పూజ, అర్చనలు పారాయణములు గాయత్రీ జపములు లలిత సహస్రనామార్చన జరిపారు. మధ్యాహ్నం నీరాజన మంత్రపుష్పం సాయంకాలం శ్రీదేవి నవావరణ పూజ, సహస్రనామార్చన నిర్వహించారు.

## ధాన్యలక్ష్మిగా.. దర్శనమిచ్చె

దేవి శరన్నవరాత్రోత్సవాలు స్వర్ణగిరి క్షేత్రంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం శ్రీస్వామి అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. పద్మావతి అమ్మవారికి నవలకశ పూర్వక పంచామృతాభిషేకం చేశారు. అమ్మవారు ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగించి సహస్ర దీపాలంకార సేవ చేపట్టారు. న్యూస్‌టుడే, భువనగిరి



# తపాలా సేవ.. సాంకేతిక తోవ



మిర్యాలగూడలోని ప్రధాన తపాలా కార్యాలయం

◆ నేడు 'ప్రపంచ తపాలా దినోత్సవం'

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన, ఉప తపాలా కార్యాలయాలు..

| నల్గొండ | సూర్యాపేట | భువనగిరి | మిర్యాలగూడ |
|---|---|---|---|
| 25 | 17 | 12 | 10 |

● ప్రధాన కార్యాలయం ● ఉప కార్యాలయాలు

**మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:** ఒకప్పుడు ఉత్తరాల బట్వాడాకే పరిమితమైన తపాలా శాఖ, మారుతున్న కాలానికనుగుణంగా అనేక అధునాతన సేవలు అందిస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం అందిపుచ్చుకుంటూ ఖాతాదారులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే పోటీని తట్టుకునేందుకు సిబ్బందిని సైతం సిద్ధం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతుంది.

### తక్షణ సేవలు..

ఉమ్మడి జిల్లాలో హుజూర్‌నగర్, నల్గొండ, భువనగిరిలో పోస్టల్ పేమెంట్స్ బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలంటే సమయాభావంతో ప్రజలు అనేక ఇబ్బందుదు పడుతున్నారు. దీన్ని గుర్తించిన తపాలా శాఖ సిబ్బందికి 5జీ చరవాణులు అందించి ఇంటి వద్ద కానీ, కార్యాలయంలో కానీ రెండే నిమిషాల్లో ఖాతా తెరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నల్గొండ డివిజన్‌లో 358, సూర్యాపేట డివిజన్‌లో 318 చరవాణులు పంపిణీ చేయగా.. తాజాగా సూర్యాపేట డివిజన్‌లో సిబ్బందికి మినీ ముద్రణ యంత్రాలను సైతం అందించారు. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 12 వరకు తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నారు.

**తపాలా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 7 నుంచి 12 వరకు చేపట్టనున్న కార్యక్రమాలు..**

| | |
|---|---|
| 9 | ప్రపంచ తపాలా దినోత్సవం |
| 11 | అంత్యోదయ దినోత్సవం |
| 12 | బాలికల ఆర్థిక అక్షరాస్యత దినోత్సవం |

### కొనసాగుతున్నవి..

ఇక తపాలా శాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పలు పథకాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. వీటిలో ముఖ్యమైనవి సుకన్య సమృద్ధి యోజన పథకంతో పాటు రూ.399, రూ.499 ఏడాది ప్రీమియంతో అందించే రూ.10 లక్షలు, రూ.15లక్షల బీమా పథకాలతో పాటు బాల ఆధార్, తపాలా కార్యాలయాల్లో ఆధార్ కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

వీటితో పాటు మహిళ ఆర్థిక అభ్యున్నతికి ప్రవేశ పెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం, పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక స్వావలంబన అందించేందుకు వడ్డీ రేట్ల పెంపు వంటివి సైతం ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

### ప్రత్యేక కార్యక్రమాలు:

వెంకటేశ్వర్లు, తపాలా సూపరింటెండెంట్, సూర్యాపేట డివిజన్



ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది 150 ఏళ్ల థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నాం. వీటిలో ప్రధానంగా విద్యార్థులకు ఉత్తరాల ప్రాముఖ్యత, చరిత్రను వివరించేందుకు క్విజ్, వ్యాసరచన పోటీలతో పాటు బాలికా సాధికారత కోసం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించనున్నాం. వీటితో పాటు అన్ని తపాలా కార్యాలయాల్లో ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టనున్నాం.





మండల కేంద్రంలో పిలుపు సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాలలో ఒంటరి మహిళలు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొని ఆడిపాడారు. - తుర్కపల్లి, న్యూస్‌టుడే:

## మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయం

**యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే:** మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయిపల్లి గ్రామంలో కలెక్టర్ హన్మంత్ కె.జెండగేతో కలిసి 30 వేల చేప పిల్లలను చెరువులోకి వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్స్యకారులకు ప్రభుత్వం పూర్తి రాయితీతో చేప పిల్లలను పంపిణీ చేయడం ద్వారా వారి అభ్యున్నతికి అవకాశాలను ఏర్పరుస్తామన్నారు. ఈ ఏడాది చెరువుల్లో నీరు ఉండడంతో చేప పిల్లల ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గోదావరి నుంచి నీరు చెరువుల్లోకి విడుదల కావడంతో నిండు కుండలా ఉన్నాయని, మత్స్యకారులకు ఇదొక మంచి అవకాశమన్నారు. జిల్లా మత్స్యశాఖధికారి రాజారామ్, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సంజయ్, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



గౌరాయిపల్లిలో కలెక్టర్ హన్మంత్ కె.జెండగేతో కలిసి చేప పిల్లలను వదులుతున్న విప్ బీర్ల అయిలయ్య, నాయకులు

## ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల రక్షణ


**భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే:** భాజపా హయాంలో మహిళలపై దాడులు, హింస పెరిగిందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి ఆరోపించారు. భువనగిరిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం నిర్వహించిన ఐద్వా జిల్లా మహాసభల్లో ఆమె మాట్లాడారు. భాజపా ప్రభుత్వం మనుధర్మశాస్త్రాలను అమలు చేస్తూ హక్కులను హరిస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో హక్కులను రక్షించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు కవ్వారు రామేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, ఉపాధ్యక్షురాలు దోనూరు నిర్మల, సహాయ కార్యదర్శి మల్లెపల్లి లలిత, కోశాధికారి కల్లూరి నాగమణి, బత్తుల జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే:** రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్‌లో ఉంటూ ఐటీ సెల్ అనుబంధంగా ఉన్న ఎమ్.సుధాకర్‌ను బాలాపూర్‌కు, భువనగిరి గ్రామీణ సీఐ ఎమ్.ప్రభాకర్‌రెడ్డిని బీబీనగర్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. బాలాపూర్ సీఐగా ఉన్న టీ.భూపతి భువనగిరి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా, సీసీఎస్‌లో ఉన్న ఎన్.చంద్రబాబును భువనగిరి గ్రామీణ సీఐగా, మల్కాజ్‌గిరి సీసీఎస్‌లో ఉన్న సాల్మాన్‌రాజును ఆత్మకూరు(ఎం)ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సర్కారు బడులకు కళకళ

**భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:** డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయుల జాబితాను మంగళవారం విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. జిల్లాకు 277 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు మంజూరు కాగా 252 మందిని ఉపాధ్యాయులుగా నియమిస్తూ జాబితాను జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో మరో 25 పోస్టులు మిగిలిపోయాయి. ఇందులో ఒక ఎస్జీటీ విభాగంలో 16 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో తొమ్మిది పోస్టులు మిగిలిపోవడం గమనార్హం. ఎంపికైన 252 మంది ఉపాధ్యాయులకు హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు సీఎం రేవంత్‌రెడ్డి అందించనున్నారు. వీరిని స్టేడియంకు తరలించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణ నుంచి ఏర్పాటు చేసిన బస్‌లలో తరలివెళ్లనున్నారు.



## రూ.10,65,000 నగదుతో అలంకరణ

**చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామంలో భవాని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాన్ని రూ.10,65,000 నగదుతో మంగళవారం అలంకరించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు.

## పారదర్శకంగా ఎమ్మెల్సీ ఓటరు జాబితా

**భువనగిరి, న్యూస్‌టుడే:** ఎమ్మెల్సీ ఓటరు జాబితా నిబంధనల ప్రకారం రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో త్వరలో ఖాళీ కానున్న టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానం వచ్చే మార్చి 29 నాటికి పూర్తవుతుందని, అందుకోసం అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు, పట్టభద్రులు మరోసారి కొత్తగా ఓటును నమోదు చేయాలని సూచించారు. నవంబర్ 6 లోపు నమోదు గడువు ముగుస్తుందన్నారు. సమీక్షలో కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు అమరేందర్, శేఖర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల సెల్ సిబ్బంది పాల్గొన్నారు.


# మిద్దెపై పంట.. ఇంట్లో వంట



మిద్దె తోటలో పెంచుతున్న కూరగాయలు, పండ్ల చెట్లు

మిద్దె సాగే ఆరోగ్యమని, ఇలా పండించిన ఉత్పత్తులతో ఇప్పటివరకు తమకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని పేర్కొంటున్నారు ఈ ఉపాధ్యాయ దంపతులు. నల్గొండ జిల్లా కేంద్రంలోని హిమగిరి కాలనీకి చెందిన ఉపాధ్యాయ దంపతులు పుష్ప-శంకర్‌రెడ్డి.. గత 12 ఏళ్లుగా కూరగాయలు, పండ్ల చెట్లు, ఆకుకూరలు, వివిధ రకాల పూల, అలంకారం మొక్కలను మిద్దెపై పెంచుతున్నారు. ఆ తోటలోనే రాలిన ఆకులని సేంద్రియ ఎరువులుగా తయారు చేసి మొక్కలకు వినియోగిస్తున్నారు. ఇలా పండించిన వాటిని తాము తినడమే కాకుండా కాలనీలో సైతం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. బయట నుంచి ఏ కూరగాయలు తెచ్చుకోమని పేర్కొంటున్నారు. గతంలో మధుమేహ వ్యాధి ఉన్నా.. సేంద్రియ ఎరువుల వాడకంతో పండిన వాటిని తింటుండటంతో ప్రస్తుతం నియంత్రణలో ఉందని తెలిపారు. 100 రకాలకు పైగా కూరగాయలు, పండ్ల, పూల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. హైదరాబాదులో నిర్వహించే మొక్కల ప్రదర్శనలు తిలకిస్తూ.. అక్కడ నుంచి కొత్త వంగడాలను తీసుకొచ్చి పెంచుతున్నామని, అరుదైన చెర్రీ, డ్రాగన్, వాటర్ ఆపిల్, టేబుల్ లెమన్, స్వీట్ లెమన్, తెల్ల అల్లనేరేడు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ బటన్ మిర్చి ప్రత్యేకంగా పెంచుతున్నట్లు.. ఇది చాలా ఘాటుగా ఉంటుందని పేర్కొన్నారు.

– ఈనాడు నల్గొండ







లిల్లీ మొక్కల వద్ద ఉపాధ్యాయుడు శంకర్ రెడ్డి



సాగుచేసిన సొరకాయ వద్ద ఉపాధ్యాయిని పుష్ప

# ‘డిజి లాకర్’.. ధ్రువపత్రాలు ఇక భద్రం

నాంపల్లి, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసే సమయంలో విద్యార్హత ధ్రువపత్రాలు ఎంతో కీలకం. అవసరమైనప్పుడు మనదగ్గర ఉండకపోవచ్చు. ఆ సమయంలో మంచి అవకాశాలు చేజారిపోవచ్చు. ఇలాంటి సమస్యలు అధిగమించేందుకు కేంద్రం తీసుకొచ్చిన సురక్షిత డిజి లాకర్ యాప్‌లో ధ్రువపత్రాలు భద్రపర్చుకోవచ్చు. ఇటీవల పలు యూనివర్సిటీలు తమ పరిధిలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులతో ఈ డిజి లాకర్ ఐడీని ఏర్పాటు చేసి ధ్రువపత్రాలు భద్రపరుచుకునే చర్యలు చేపడుతున్నాయి. ఈ సదుపాయం లేకముందు ఈ- మెయిల్స్‌లో భద్రపరుచుకునేవారు. వీటికంటే ప్రభుత్వ అధీకృత యాప్ డిజి లాకర్‌లో భద్రపర్చుకుంటే సురక్షితమని విద్యా నిపుణులు చెబుతున్నారు.



## పోతాయనే భయం ఉండదు

డిజి లాకర్‌తో అనుసంధానమైన ప్రభుత్వ శాఖలు అందించే పత్రాలను వీటిలో భద్రపరచుకోవచ్చు. అందుకు ఆయా పత్రాల రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు చేస్తే చాలు. అనుసంధానం కాకపోయినా స్కాన్ చేసిన పత్రాలనూ భద్రపరచవచ్చు. అందుకు ప్రతి లాకర్‌కు 1 జీబీ స్టోరేజి సామర్థ్యం కేటాయిస్తారు. ధ్రువపత్రాలు సమర్పించడానికి యూఆర్ఎల్ లింకు పంపించడానికి కొన్ని సంస్థలు అనుమతులు కూడా ఇస్తున్నాయి. విదేశీ, దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు ధ్రువపత్రాలు తీసుకెళ్లే సమయంలో పోతాయనే భయం ఉండదు.

## డౌన్‌లోడ్ ఇలా..

★ ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి డిజి లాకర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

★ యాప్‌లో మీ పేరు, పుట్టిన తేదీ, ఈ మెయిల్, ఫోన్ నంబరు, ఆరు అంకెల పిన్ నంబరు నమోదు చేయాలి.

★ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేస్తే డిజి లాకర్ యాప్‌ను ప్రారంభించడానికి సిద్ధమైనట్లు అర్థం.

★ యాప్‌లో పాన్ కార్డు, ఆధార్, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్ల జాబితా కనిపిస్తుంది.

★ వాటిలో మనకు కావాల్సినవి ఎంచుకొని ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసుకోవాలి.

★ ఉదాహరణకు 10వ తరగతి మెమో కావాలంటే బోర్డు ఎంచుకున్నాక హాల్ టికెట్ నంబరు నమోదు చేయాలి. 2004 తర్వాత పత్రాలు అందుబాటులో ఉన్నాయి. అలారాని పక్షంలో డిజి లాకర్ డ్రైవ్‌ను క్లిక్ చేస్తే ప్లస్ సింబల్ కనిపిస్తుంది. క్లిక్ చేసి కావాల్సిన పత్రాలను మాన్యువల్‌గా అప్‌లోడ్ చేసి దాచుకోవచ్చు.

### ఏమేం దాచుకోవచ్చు..

ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, విద్యార్హత ధ్రువపత్రాలు, మార్కుల జాబితాలు, కుల, ఆదాయ, జనన పత్రాలు, ఆస్తి, రిజిస్ట్రేషన్ కాగితాలు, రేషన్ కార్డు, ఆరోగ్య బీమా, ఓటరు ఐడీ ఇలా.. ఒకటేమిటి మీకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, కార్డులు భద్రపర్చుకోవచ్చు.

# ఆ అలవాటుకు.. 25 ఏళ్లు



ఠాగూర్ సేకరించిన వివిధ దేశాల తపాలా స్టాంపులు

○ నాణేలు, విదేశీ కరెన్సీ నోట్లు సేకరిస్తున్న వ్యాపారి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

చిన్నతనంలో తమ ఇంటికి వచ్చే ఉత్తరాల స్టాంపులు సేకరించడం అలవాటుగా మారిన అతడికి.. చదువుకునే వయసులో బహుమతిగా వచ్చిన నేపాల్ కరెన్సీ నోటు.. వివిధ దేశాల కరెన్సీ నోట్ల సేకరణకు ప్రాణం పోసింది. దీంతో 25 ఏళ్లుగా వేలాది స్టాంపులు, నాణేలు, నోట్లు సేకరించిన అతడు.. నేటితరం చిన్నారులకు వాటి గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో తన వ్యాపార ప్రాంతంలో ప్రదర్శిస్తున్నాడు.

★ మిర్యాలగూడ పట్టణానికి చెందిన గరిణె ఠాగూర్.. డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. 1998లో నాలుగో తరగతి చదువుతున్నప్పుడు తన ఇంటికి వచ్చే ఉత్తరాల నుంచి స్టాంపులు సేకరించడం మొదలు పెట్టాడు. ఆ తర్వాత రెండేళ్లకు తమ ఇంటి సమీపంలోని ఓ వసతిగృహానికి కాపలాదారుగా ఉన్న నేపాల్ వ్యక్తిని వారి నగదు ఎలా ఉంటుందని అడుగగా.. అతడొక నోటును బహుమతిగా ఇచ్చాడు. దానిని మురిపెంగా చూసుకుని ఇతర దేశాల కరెన్సీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నాడు. దీంతో దీనినే తన అలవాటుగా మలచుకుని నేటి వరకు సుమారు వంద దేశాల నుంచి సేకరించిన 2వేల నోట్లు, 5వేల నాణేలు, వివిధ దేశాలకు చెందిన 4వేల స్టాంపులు సేకరించాడు. వీటితో పాటు దేశానికి చెందిన సుమారు 400 రకాల అగ్గిపెట్టెలు సైతం సేకరించాడు. వీటి విలువ సుమారు రూ.10లక్షలకు పైగానే ఉంటుందని అంచనా.



వివిధ దేశాల కరెన్సీ నోట్లు

### పురాతనం నుంచి అధునాతనం వరకు..

ఠాగూర్ సేకరించిన వాటిలో పురాతన కాలం నుంచి ఇటీవలి వరకు కరెన్సీ నోట్లు, స్టాంపులు ఉన్నాయి. నిజాం నవాబుల కాలం నాటి స్టాంపులు, కరెన్సీ నోట్లతో పాటు వెండి నాణేలు, దిల్లీ సుల్తానుల, తమిళనాడు చోళ రాజుల, మైసూర్ టిప్పు సుల్తాన్ కాలాల నాటి నాణేలు సైతం సేకరించాడు. వీటితో పాటు ఇటీవల హాంకాంగ్, రష్యా, ఈస్ట్ కరేబియాన్, న్యూజిలాండ్, సోలోమన్ ఐలాండ్, సింగపూర్, మాల్దీవులు తదితర దేశాలు ప్రవేశపెట్టిన పాలిథిన్ కరెన్సీ నోట్లు సైతం సేకరించాడు. వీటిలో ప్రపంచంలోనే అతి విలువైన దుబాయ్ కరెన్సీతో పాటు తక్కువ విలువైన ఇండోనేషియా కరెన్సీ నోట్లు సేకరించాడు. యుగోస్లేవియాలో పాత నోట్లు రద్దు చేసిన సమయంలో ముద్రించిన కొత్త నోట్లు సైతం ఇతడి సేకరణలో భాగమయ్యాయి. ఇండోనేషియా కరెన్సీ నోటుపై వినాయకుడి చిత్రం, క్యూబా కరెన్సీ నోటుపై చెగువెరా చిత్రం ముద్రించిన నోట్లు సైతం సేకరించి ఔరా అనిపిస్తున్నాడు.

**పిల్లలకు తెలియజేయాలనే:** గరిణె ఠాగూర్, మిర్యాలగూడ



తపాలా స్టాంపులు, కరెన్సీ నోట్లు, నాణేలను విక్రయించాలన్న ఆలోచన ఎప్పుడూ చేయలేదు. వాటిని పెట్టెల్లో నిరుపయోగంగా ఉంచడం కంటే.. మా దుకాణానికి వచ్చే చిన్నారులకు వివిధ దేశాల కరెన్సీ.. తపాలా స్టాంపుల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో నోట్లను టేబుల్‌పై అద్దం కింద పేర్చాను. వీటిని చూసిన చిన్నారులు వివిధ కరెన్సీ నోట్లు, వాటి విలువ, ప్రత్యేకతల గురించి వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నాను.

## హీటర్ వాడుతున్నారా..
# ఈ జాగ్రత్తలు తప్పనిసరి



భానుపురి, న్యూస్‌టుడే: నిత్యం ఎక్కడో ఒకచోట విద్యుత్తు ప్రమాదాల కారణంగా మరణిస్తూనే ఉన్నారు. ఇంట్లో వాడే కరెంటు పరికరాలపై అవగాహన లేక విద్యుదాఘాతానికి గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం, శీతాకాలంలో వేడి నీటితో స్నానం చేస్తారు. ఇందుకు నీళ్లను వేడి చేసేందుకు హీటర్ వినియోగిస్తారు. కొనేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో విద్యుదాఘాతానికి గురవుతున్నారు. విద్యుత్తు ప్రసారం జరిగే ఇనుము బకెట్లో కాకుండా ప్లాస్టిక్ బకెట్‌లో నీటిని వేడిచేయాలి. హీటర్‌ను వినియోగించేటప్పుడు నీటిలోకి ఎంత మేర ఉంచాలో దానిపై గుర్తు ఉంటుంది. బకెట్‌లో ఉంచే సమయంలో కర్రను వాడాలి. నాణ్యత లేని హీటర్లను ఉపయోగించటం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. పాత వాటర్ హీటర్ రాడ్లను ఉపయోగించొద్దు. హీటర్‌కు లవణాలు పట్టుకొని ఉంటాయి. వారానికోసారి శుభ్రం చేస్తే త్వరగా నీరు వేడవుతుంది.

### ఇలా చేస్తే మేలు..

☛ స్విచ్ ఆన్ చేసినప్పుడు నీటిని తాకొద్దు. విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉంది. ఆఫ్ చేసిన 10 సెకన్ల తర్వాత వాటర్ హీటర్ బయటకు తీసి చూడాలి.

☛ పిల్లలు ఉన్నచోట, చేతికి అందే ప్రాంతంలో హీటర్ పెట్టవద్దు. విద్యుదాఘాతం జరిగే ఆస్కారం ఉంటుంది. స్నానపు గదుల్లో ఏర్పాటు చేసుకోవద్దు.

☛ హీటర్ పెట్టిన తర్వాత వేడి ఉన్నంత సేపు దానిని ప్లాస్టిక్ బకెట్‌కు దూరంగా ఉంచాలి. వేడికి ప్లాస్టిక్ కరిగిపోతోంది.

☛ హీటర్లను గంటల తరబడి పెట్టవద్దు.

☛ హీటర్ రాడ్‌ను నీళ్లలో మునిగేలా చూసుకోవాలి. స్విచ్ ఆఫ్ చేసిన తర్వాత, ప్లగ్‌ను తీసిన తర్వాతే నీళ్లను తాకి వేడిని పరిశీలించాలి.

☛ ఐఎస్ఐ మార్కు ఉన్న హీటర్లను కొనుగోలు చేయాలి. 1500-200 వాట్స్‌తోపాటు ఓల్టేజీ 230-250 మధ్య ఉండే హీటర్లను కొనాలి.

**జిల్లాలో గృహ విద్యుత్తు కనెక్షన్లు**

| జిల్లా | కనెక్షన్లు |
|---|---|
| సూర్యాపేట | 4,51,501 |
| నల్గొండ | 5,82,220 |
| యాదాద్రి | 3,75,247 |

## చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి ఒకరికి జైలుశిక్ష

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన పట్టేటి రామయ్య ఎలియాస్ రాములుకు సంవత్సరం జైలుశిక్ష ఖరారు చేస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్ రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. ఆ తీర్పు ప్రకారం వివరాలు.. రావులపల్లి గ్రామానికి చెందిన పట్టేటి రామయ్య తన అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన కసనబోయిన లింగయ్య వద్ద రూ.రెండు లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించే నిమిత్తం అదే మొత్తానికి చెక్కు జారీ చేశాడు. దాన్ని బ్యాంకులో జమచేయగా రామయ్య ఖాతాలో నగదు నిల్వలు లేని కారణంగా చెల్లుబాటు కాలేదు. నోటీసు పంపినా ఫలితం లేకపోవడంతో బాధితుడు తుంగతుర్తి ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో ఫిర్యాదు దాఖలు చేశాడు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడైన రామయ్యపై నేరాన్ని నిర్ధారించి సంవత్సరం జైలుశిక్ష విధించడంతోపాటు రూ.3.60 లక్షలు బాధితునికి పరిహారంగా చెల్లించాలని ఆదేశిస్తూ గతంలోనే తీర్పు ఇచ్చింది. తీర్పుపై నిందితుడు జిల్లా న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేసుకోగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నిందితునికి విచారణ న్యాయస్థానం విధించిన జైలుశిక్ష, జరిమానాలను ఖరారు చేస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు.

## గంజాయి స్మగ్లర్లపై కేసు నమోదు

చౌటుప్పల్‌గ్రామీణం: కారులో అక్రమంగా 54 కిలోల గంజాయిని తరలిస్తుండగా పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని పుణేకు కారులోని సీట్ల కింద రహస్య స్థావరంలో ముగ్గురు స్మగ్లర్లు గంజాయిని తరలిస్తున్నట్టు చెప్పారు. రాచకొండ ఎస్వోటీ పోలీసులతో కలిసి కారును, గంజాయిని, నాలుగు చరవాణులను స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రకాశ్ ధ్యానేశ్వర్, నవనత్ బాబన్ మహిత, ధర్మ అశోభ తువార్‌లపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

# ఎదురుచూపులు ఉండవిక..!



సూర్యాపేటలోని మార్కెట్ యార్డులో పత్తి బస్తాలు(పాత చిత్రం)

❐ పత్తి నగదు సమాచారానికి కాటన్-అల్లై యాప్

భానుపురి, న్యూస్‌టుడే:

సీసీఐకి పత్తి విక్రయించిన రైతులకు ఇక నుంచి దిగులుండదు. నగదు బ్యాంకు ఖాతాలో పడే వరకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వారికి ఇక నుంచి ఆ ఇబ్బందులు ఉండవు. సమయానికి నగదు జమ కాకపోవడంతో అధికారుల వద్దకు వెళ్లి వాకబు చేస్తుంటారు. ఇందుకు గ్రామాల నుంచి పట్టణంలోని కార్యాలయాలకు వెళ్లొస్తుంటారు. అటు సీసీఐ కార్యాలయాల చుట్టూ అన్నదాతలు తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సీసీఐ ‘కాటన్-అల్లై’ పేరుతో కొత్త యాప్‌ను కొనుగోళ్ల వరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే మేలు చేకూరనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### 7.18 లక్షల ఎకరాల సాగు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈసారి 7.18 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. అంతర్జాలం వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రతి ఇంట్లో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంటోంది. సీసీఐ తీసుకొచ్చే యాప్ ద్వారా పత్తి నగదు చెల్లింపు ప్రక్రియ ఏ మేరకు వచ్చిందనే కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు వీలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల పంట దెబ్బతింది. దీంతో దిగుబడిపై రైతుల్లో దిగులు నెలకొంది. సరాసరి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు వివరాలు (ఎకరాల్లో..)**

| జిల్లా | ఎకరాలు |
|---|---|
| సూర్యాపేట | 78,094 |
| నల్గొండ | 5,40,022 |
| యాదాద్రి | 1,00649 |

## ఎయిమ్స్‌ను సందర్శించిన రాష్ట్ర వైద్య బృందం

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్‌లోని ఎయిమ్స్‌ను తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, హైదరాబాద్ నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్యులు, సంబంధిత శాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియాతో పాటు వైద్య బృందం సభ్యులు.. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ బృందం సభ్యులకు వివరించారు. సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన తెరపై ఆసుపత్రి పురోగతిని వివరించారు. అనంతరం రాష్ట్ర బృందం ఆసుపత్రిలోని ఓపీడీ, ఇన్‌పేషెంట్, అత్యవసర విభాగాలు, పలు ల్యాబ్‌లను, ఎయిమ్స్ ఆవరణలో నిర్మితమవుతున్న నూతన భవన నిర్మాణ సముదాయాలను తిరిగి పరిశీలించారు. ఎయిమ్స్ మెడికల్ పర్యవేక్షకుడు డాక్టర్ అభిషేక్ అరోరా, వైద్యులు సంగీత సంపత్, శ్యామల అయ్యార్, తదితరులు పాల్గొన్నారు.



బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్య సేవల వివరాలు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బృందానికి వివరిస్తున్న ఆసుపత్రి డైరెక్టర్ భాటియా

## ‘తనిఖీలు జరుగుతున్నాయ్’

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రైస్ మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా అనే దానిపై, సీఎంఆర్ గడువు తిరిగి పెంచేందుకు మిల్లుల్లో తనిఖీలు జరుగుతున్నాయని పౌరసరఫరాల డీఎం టీఎన్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఈనాడులో ‘ధాన్యం ఉందా.. ధనమై పోయిందా’ శీర్షికతో వచ్చిన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. జిల్లాలో 2023-24 వానాకాలంలో 2,08,113 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, దానికి మిల్లర్లు సీఎంఆర్ బియ్యం 1,39,436 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. అందులో 82,729 మెట్రిక్ టన్నులు మిల్లర్లు ఇచ్చారని, ఇంకా 57,282 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉందని తెలిపారు. గత నెల 30తో సీఎంఆర్ గడువు ముగిసినందున ప్రస్తుతం ఎఫ్‌సీఐ మిల్లుల్లో రావాల్సిన బియ్యానికి ధాన్యం ఉందా లేదా తెలుసుకోవడం కోసం, మళ్లీ బియ్యం పెట్టేందుకు గడువు ఇచ్చేందుకు తనిఖీలు జరుగుతున్నాయని వివరించారు. బియ్యం బకాయి ఉండి మిల్లుల్లో ధాన్యం లేకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫాంరేటు | 114–00 |
| రిటైల్ | 136–00 |
| డ్రెస్డ్ | 197–00 |
| స్కిన్‌లెస్ | 224–00 |

## ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతి.. ఆందోళన

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందగా.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళనకు దిగిన ఘటన మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలలో చోటు చేసుకుంది. బాధిత బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన 10 నెలల గర్భిణి మౌనికకు నొప్పులు రావడంతో ఈ నెల 6న పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పురిటి నొప్పులు కావనే కారణంతో రెండు రోజుల పాటు సాధారణ ప్రసవం కోసం ఆసుపత్రిలో ఉంచారు. మంగళవారం ఉదయం గర్భంలోని శిశువు గుండె సక్రమంగా కొట్టుకోవడం లేదని హడావుడిగా శస్త్ర చికిత్స చేసి మగ బిడ్డ పుట్టాడని.. శిశువు ఆరోగ్యం సక్రమంగా లేనందున నల్గొండకు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అంతదూరం వెళ్తే ప్రమాదం జరుగుతుందని భావించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్తామని చెప్పడంతో.. శిశువును చూపించకుండా వివిధ కారణాలతో ఆడ శిశువు మృతి చెందిందని తెలిపారని ఆరోపించారు. తొలుత మగ శిశువు అని చెప్పిన వైద్యులు.. తర్వాత ఆడ శిశువు అని చెప్పడంలో ఆంతర్యమేమిటని.. అంతా బాగానే ఉందని చెప్పి హడావుడిగా శస్త్ర చికిత్స నిర్వహించటమేమిటని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు.



మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలలో ఆందోళన చేస్తున్న బాధిత బంధువులు

★ ఘటనపై ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వహీదా, డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ.. రెండు రోజులుగా గర్భస్థ శిశువు ఆరోగ్యం బాగానే ఉందని.. ఈ ఉదయం గుండె సక్రమంగా కొట్టుకోకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అత్యవసరంగా శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. శిశువు మెడకు బొడ్డు తాడు చుట్టుకోవడంతో పాటు గర్భంలోనే మల విసర్జన జరిగి, ఉమ్మనీరుతో పాటు మింగడంతో ఊపిరాడక మృతి చెందినట్లు వివరించారు. ఆసుపత్రి వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రెండో పట్టణ సీఐ నాగార్జున, ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. కాగా ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ నాగార్జున తెలిపారు.

## ప్రభుత్వ బడులకు కొత్త ఉపాధ్యాయులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడులకు కొత్త ఉపాధ్యాయులు రాబోతున్నారు. డీఎస్సీ-2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం బుధవారం నియామక ఉత్తర్వులు ఇవ్వనుంది. ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీ-2024 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చివరిదశకు చేరింది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ప్రభుత్వం 1268 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 ఖాళీలు ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది. ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియలో 1:3 చొప్పున మెరిట్ అభ్యర్థులను తీసి ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిపారు. వారి నుంచి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాలు అందచేయనున్నారు. డీఎస్సీలో మొదటి సారి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించి త్వరితగతిన ఫలితాలు వెల్లడించి నియామకాలు చేపట్టడం గమనార్హం.

## ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండురోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు.

**రాణించిన ‘లక్ష్య’ అథ్లెట్లు** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు ‘లక్ష్య’ అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.కైఫ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్ కుమార్ జావెలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన ‘లక్ష్య’ అథ్లెట్లను నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

# అసంపూర్తిగా ఆధునిక దోభీఘాట్



చౌటుప్పల్‌లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న ఆధునిక దోభీఘాట్

యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 2023 ఆగస్టు 11న అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా దోబీఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఒప్పందం ప్రకారం శంకుస్థాపన జరిగిన నాటి నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో దీన్ని పూర్తి చేయాల్సి ఉంది. గడువు ముగిసింది. పైకప్పు నిర్మించి పనిని నిలిపివేశారు. దీనిపై పురపాలక శాఖ డీఈ మనోహర్‌ను వివ

చౌటుప్పల్ పట్టణంలో ఆధునిక దోబీఘాట్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో టీయూఎఫ్‌ఐడీసీ నిధుల రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఆధునిక వాషింగ్ మిషన్లు, డ్రయ్యర్లు, ఐరన్

రణ కోరగా, ఇప్పటి వరకు యాభై శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వం దోబీఘాట్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయలేదని చెప్పారు. నిధులు విడుదల కాగానే పూర్తి చేయిస్తానని వెల్లడించారు. - చౌటుప్పల్, న్యూస్‌టుడే:

# నాటు కోళ్లు పెంచి.. లాభాలు ఆర్జించి



వలిగొండ: వెలువర్తిలో కిశోర్ పెంచుతున్న కోళ్లు



కిశోర్

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెలువర్తి గ్రామానికి చెందిన పరకాల ముత్యాలు- సత్యలక్ష్మి దంపతుల చిన్న కుమారుడు పరకాల కిశోర్ డి.ఎంఎల్‌టీ, ఎంఎస్సీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా రెండేళ్లు పని చేశారు. ప్రభుత్వం నిర్వహించిన పలు పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇతరుల వద్ద ఉద్యోగం చేస్తే పని ఒత్తిడి ఉందని స్వయం ఉపాధి మార్గం ఎంచుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో షెడ్ ఏర్పాటు చేసి నాటు కోళ్ల పెంపకం చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం నుంచి మేలైన 15 వేల నాటు కోడి పిల్లలు దిగుమతి చేసుకున్నారు. వెయ్యి పిల్లలను షెడ్‌లో మూడు నెలలు పెంచి ఒక కోడిని రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. మిగిలిన 14 వేల పిల్లలను మేడ్చల్ జిల్లా గజ్జుకోసారంలో విక్రయించి లాభాలు పొందాడు. నాటు కోడి పిల్లలను పెంచడానికి, ఇతర ఖర్చులకు గానూ రూ.1.5 లక్షలు పోనూ, నాలుగు నెలలకు సుమారుగా రూ.2.5 లక్షల ఆదాయం వస్తోందని కిశోర్ పేర్కొన్నారు. బ్రాయిలర్ కంటే నాటు కోళ్లకు మంచి డిమాండ్ ఉన్నందున క్రమంగా తగిన ఫలితం లభిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తే పెద్ద కోళ్ల షెడ్ నిర్మాణం చేపట్టి గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తానని కిశోర్ చెబుతున్నారు.

– వలిగొండ, భువనగిరి, న్యూస్‌టుడే



## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి కొనుగోళ్లు చేపట్టాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మంచాల మధు, నాయకులు యాదిరెడ్డి, మన్నే పద్మారెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకటరెడ్డి, కందాల సుదర్‌రెడ్డి, అయిలారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం, సీఐటీయూ నాయకులు

## కరపత్రం ఆవిష్కరణ

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మానసిక రుగ్మతలను నివారించేందుకు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఎ కరీం, రాకేష్‌కుమార్, కృష్ణగోపాల్‌బండారి సంయుక్తంగా రూపొందించిన అవగాహన సదస్సుల వివరాల బ్రోచర్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆవిష్కరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి కార్యాలయంలో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించినట్లు కరీం తెలిపారు.

## యువకుడిపై నుంచి వెళ్లిన లారీ

☛ కాలు తొలగించిన వైద్యులు

చౌటుప్పల్(గ్రామీణం), న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన కేతబోయిన అఖిలేష్(23) డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అఖిలేష్ స్నేహితులతో కలిసి దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహం నిమజ్జనానికి లారీ అవసరం కావడంతో స్నేహితులతో కలిసి పంతంగి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నాడు. అక్కడ లారీలను ఆపే క్రమంలో.. విజయవాడ వైపు మార్గంలో టోల్ బూత్ దాటగానే ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి అఖిలేష్‌ను ఢీకొట్టాడు. అనంతరం అతని కాలు పైనుంచి లారీ టైరు వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అఖిలేష్ కాలును తొడ భాగం వరకు తొలగించారు. క్షతగాత్రుని సోదరుని ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నంగునూరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట జిల్లా రాజగోపాలపేట ఎస్సై ఎండీ ఆసిఫ్ తెలిపారు. మండల పరిధి ఖాతా గ్రామంలో మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా యాదాద్రి భువనగిరి జిల్లా రాజంపేట మండలానికి చెందిన భూక్య శ్రీను, మాడోతు శ్రీను అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు ఆరా తీయగా ఇద్దరు కలిసి గ్రామంలో రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరించి ట్రాలీ ఆటోలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని తేలింది. పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తప్పిపోయిన బాలుడి అప్పగింత

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక బస్టాండ్‌లో తిరుగుతున్న మూడేళ్ల బాలుడిని పోలీసులు, బాలల పరిరక్షణాధికారి సమక్షంలో తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. తుర్కపల్లి మండలం మల్కాపురం బద్దు తండాకు చెందిన గుగ్లోతు మధు, అనూష దంపతులు తమ మూడేళ్ల బాబు ధనుష్‌తో బస్టాండ్ వద్ద ఖిలానగర్‌లో అద్దెకు తీసుకొని ఉంటూ పూల వ్యాపారం చేస్తున్నారు. బాలుడిని నానమ్మకు అప్పగించి వీరు వ్యాపారానికి బయలు దేరారు. నానమ్మ వద్ద నుంచి తప్పిపోయిన బాలుడు స్థానిక బస్టాండ్‌లో తిరుగుతుండగా బాలల హక్కుల కార్యకర్త కొడారి వెంకటేశ్ గమనించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి, బాలల పరిరక్షణాధికారి సైదులుకు సమాచారం అందించారు. బాలుడికి మాటలు రాకపోవడంతో ఎలాంటి సమాచారం ఇవ్వలేక పోయారు. దీంతో బాలసదన్‌లో తరలించే ప్రయత్నం చేస్తుండగా తల్లిదండ్రులు బాలుడి కోసం గాలిస్తూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. దీంతో బాలుడిని వారికి అప్పగించారు.

## హామీలు అమలు చేయండి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా నుంచి సింహద్వారం వరకు ఏర్పాటు చేసిన వంతెన మార్గం తొలగిస్తామని గతంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే అమలు చేయాలని భాజపా డిమాండ్ చేసింది. యాదగిరిగుట్టలో మంగళ



యాదగిరిగుట్టలో.. రాస్తారోకో చేస్తున్న భాజపా శ్రేణులు

వారం రాస్తారోకో చేపట్టిన నిరసన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, నాయకులు భానుచందర్, రచ్చ శ్రీనివాస్, బుచ్చిబాబు, నరేశ్, నవీన్, రాజిరెడ్డి, అజయ్, శివ, వంశీ, కార్తిక్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

## శ్రీచక్రాలకు పూజలు

భువనగిరి గ్రామీణం: రమణేశ్వరంలో ప్రతిష్ఠిస్తున్న శ్రీచక్రాలు సూర్యచంద్రులున్నంత కాలం నిత్య పూజలందుకుంటాయని సిద్ధ గురు రమణానందమహర్షి పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డి పల్లి వద్ద గల శివశక్తి షిరిడీసాయి అనుగ్రహ పీఠంలో దేవినవ రాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీచక్రాల ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు మంగళవారం దాతలచే పూజలు నిర్వహించి 210 శ్రీచక్రాలు ప్రతిష్ఠించి, అనంతరం ఆయన మాట్లాడారు. సాయంత్రం దాతలు, భక్తులకు ప్రవచనం చేశారు. పాల్గొన్న వేలాది మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## మద్యం దుకాణాల్లో తనిఖీలు

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పండగ సంసదర్భంగా ముందస్తు జాగ్రత్తలో భాగంగా జిల్లా ప్రొహిబిషన్, ఆబ్కారీ శాఖ, డీటీఎఫ్ సంయుక్తంగా మండలంలోని పలు తండాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకిషన్ మాట్లాడుతూ.. మండలంలో ఎవరైనా నాటు సారాయిని నిల్వ ఉంచినా, విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం టోల్‌ప్లాజా వద్ద రెండు టీంలుగా ఏర్పడి రూట్ వాచ్ చేశారు. ఆకుతోటబావి తండా, కాండ్లకుంటతండా, పచ్చర్లబోడుతండాలలో సోదాలు జరిపారు.

## చీరలు పంపిణీ

వలిగొండ: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఐటిపాముల రవీంద్ర-రమ్యశ్రీ దంపతులు గ్రామ పంచాయతీ కార్మికులకు చీరలు, రూ.10 వేల నగదును మంగళవారం అందజేశారు.

# బిక్కేరు ఒక్కసారి పారితే ఏడాదంతా నీరు: ఎమ్మెల్యే సామేల్



మోత్కూరు బిక్కేరులో గోదావరి నదీజలాలకు పూలు, పసుపు, కుంకుమ వదులుతున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, న్యూస్‌టుడే: సరిపడా వర్షాలు కురవక, చెరువులు నిండక రైతులు మనస్తాపానికి గురవుతుంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గంధమల్ల జలాశయం ద్వారా మోత్కూరు ప్రాంతానికి గోదావరి నీళ్లు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం బిక్కేరు ద్వారా గోదావరి జలాలు మోత్కూరుకు చేరుకున్న సందర్భంగా ఆ నీటికి ఎమ్మెల్యే పూజలు చేసి, పూలు, పసుపు, కుంకుమ వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బిక్కేరు ఒకసారి పారితే ఏడాదంతా ఇసుక బోర్లు నీరందిస్తాయని, తాగునీటికి కూడా ఇబ్బందులు రావని చెప్పారు. జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పి.వెంకటేశ్వర్లు, సోమిరెడ్డి, జి.రామచంద్రుగౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పుర ఇన్‌ఛార్జి కమిషనర్ సి.శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

**అడ్డగూడూరు:** మండలంలోని మానాయకుంటలో గతనెలలో వరదనీటిలో కొట్టుకుపోయి మృతిచెందిన బోడ అయిలమ్మ కుటుంబానికి వరద బాధితుల సహాయార్థం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే సామేల్ అందజేశారు. సింగిల్‌విండో ఛైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, ఇన్‌ఛార్జి తహసీల్దార్ సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పొలెబోయిన లింగయ్యయాదవ్, జోజి, శ్రీశైలం, పాల్గొన్నారు.

**వరద బాధితులకు సొసైటీల సాయం.. మోత్కూరు, తుంగతుర్తి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు నియోజకవర్గంలోని పీఏసీఎస్ ఛైర్మన్లు రూ.70 వేలు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసి వారు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఛైర్మన్లు పాలెపు చంద్రశేఖర్, నాగం జయసుధ, కుంట్ల సురేందర్‌రెడ్డి, తాళ్లూరి మురళి, పేలంపూడి వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## వనరుల వినియోగంపై అవగాహన

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వీరవెల్లిలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ విద్యార్థినుల ఆధ్వర్యంలో 'గ్రామ భాగస్వామ్య విశ్లేషణ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వనరుల వినియోగంపై అవగాహన కల్పించారు. పంటల సాగులో అధికంగా ఎరువుల వాడకంపై కలిగే నష్టాలను వివరించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి నిర్మల, ఏరువాక శాస్త్రవేత్త మమత, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, అభ్యుదయ రైతు కంచి మల్లయ్య, సురేందర్, చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్, విద్యార్థినులు పాల్గొన్నారు.



పటం ద్వారా వ్యవసాయంపై మెలకువలను తెలియజేస్తున్న విద్యార్థినులు

# ఆటపాటలు.. ఆత్మీయ పలకరింపులు



ఆలేరు: ప్రభుత్వ ఆసుపత్రిలో బతుకమ్మలకు పూజలు చేస్తున్న మహిళా వైద్యులు

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మాజీ సర్పంచి మల్లగారి భాగ్యలక్ష్మి తన నివాసంలో వేపకాయల బతుకమ్మ నిర్వహించారు. వేడుకల్లో బిగ్‌బాస్ ఫేమ్ సావిత్రి పాల్గొన్నారు. అనంతరం దాసరి బస్తీలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

**ఆలేరు:** ఆలేరులోని ప్రభుత్వ కమిషనరేట్ ఆసుపత్రిలో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా వైద్యులు, పారామెడికల్ మహిళా సిబ్బంది ఆసుపత్రి ఆవరణలో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.జె.స్వప్నరాథోడ్, డా.వి.శిరీష, డా.రజని, డా.స్వప్న, స్టాఫ్‌నర్సులు ఊర్మిల, మంజుల, సమీన, ఆరోగ్యశ్రీ సిబ్బంది సుమ, ఇందిర, డా.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

**మోటకొండూరు:** మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలు మంగళవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యశోద, డీఐవో రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిల్పిని, ఎంఎంవో డాక్టర్ విజయ్, మండల వైద్య సిబ్బంది బతుకమ్మ ఆట ఆడి పాడారు. ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు అంకితభావంతో వైద్య సేవలు అందిస్తేనే వారి జీవితాల్లో నిజమైన పండుగ అని వైద్యాధికారులు అన్నారు.



బీబీనగర్‌లో..



యాదగిరిగుట్ట ప్రభుత్వ వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం వద్ద..

**గుండాల:** గుండాల మండల కేంద్రంలో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత పాల్గొని వారితో కలిసి ఆట ఆడి ఉత్సాహాన్ని నింపారు.

**యాదగిరిగుట్ట పట్టణం:** యాదగిరిగుట్ట ప్రభుత్వ వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి కె.ధనంజనేయులు, కేంద్రం ఇన్‌ఛార్జి జానకిరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

**బొమ్మలరామారం :** జలాల్‌పురంలో సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరిగింది. గ్రామంలోని మహిళలు వివిధ రకాలైన పూలతో పేర్చిన బతుకమ్మలను గ్రామ కూడలిలో ఉంచి బతుకమ్మ ఆటను ఆడారు.

## గ్రామాలను మున్సిపాలిటీలుగా మారిస్తే పేదలు ధనవంతులయ్యారా?



మోత్కూరు: మాట్లాడుతున్న ఎండీ.జహంగీర్

మోత్కూరు, న్యూస్‌టుడే: గ్రామాలను కలిపి మున్సిపాలిటీలుగా మారిస్తే పేదలు ధనవంతులయ్యారా? అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ ప్రశ్నించారు. మంగళవారం మోత్కూరులోని సుందరయ్య కాలనీలో పుర సీపీఎం మహాసభ ఆర్.రాములమ్మ అధ్యక్షతన జరిగింది. జహంగీర్ మాట్లాడుతూ పురపాలికల్లో ఉపాధిహామీ పథకాన్ని అమలు చేసి పేదలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పైళ్ల యాదిరెడ్డి, కె.రాములు, అంజయ్య, నర్సింహ పాల్గొన్నారు.

**సీపీఎం మండల కార్యదర్శిగా వెంకటనర్సు.. మోత్కూరు:** మోత్కూరు మండల 8వ మహాసభలో మండల కార్యదర్శిగా గుండు వెంకటనర్సును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం మంగళవారం విలేకరులకు తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తామని, హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని గుండు వెంకటనర్సు తెలిపారు.

## గోదావరి జలాలు తెచ్చిన ఘనత కేసీఆర్‌దే

మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, తదితరులు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: గోదావరి జలాలు ఆలేరు, భువనగిరి నియోజకవర్గ ప్రాంతాలకు తీసుకువచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత స్పష్టం చేశారు. యాదగిరిగుట్టలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ దూరదృష్టి, దార్శనికతతో ఎక్కడో అట్టడుగున ఉన్న గోదావరి జలాలను 534 అడుగుల పైకి ఎత్తిపోస్తూ, 1400 కిలో మీటర్ల పొడవున కాల్వలు తవ్వించి, 203 కిలో మీటర్ల సొరంగ మార్గాల ద్వారా ఈ ప్రాంతానికి ఆ నీటిని తెచ్చిన ఘనత ఈ ప్రాంత ప్రజలందరికి తెలుసునన్నారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ గడ్డమీది రవీందర్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, కౌన్సిలర్ మమత, నాయకులు రేపాక స్వామి, స్వాతి, దశరథ, వీరేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

# వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు



తుర్కపల్లి రామాలయంలో... మహాలక్ష్మి అవతారంలో దుర్గాదేవి

యాదాద్రి భువనగిరి జిల్లాలో దుర్గాదేవి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల్లో అన్నదానాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


- న్యూస్‌టుడే బృందం



వలిగొండలో దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



చౌటుప్పల్ గాంధీ పార్కులో అన్నప్రసాదం పంపిణీని ప్రారంభిస్తున్న పుర ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు



భువనగిరి: పూజలు నిర్వహించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



లక్కారంలోని దుర్గాదేవికి పూజలు చేస్తున్న మహిళలు



మోత్కూరు: అంగడిబజారులో దుర్గాదేవి అమ్మవారికి హారతి నివేదిస్తున్న మహిళలు



బీబీనగర్‌లో..

## భర్త ప్రోత్సాహంతో.. మొదటి ప్రయత్నంలోనే...



అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మాది నిరుపేద వ్యవసాయ కుటుంబం.. అమ్మ బండ అలివేల, నాన్న బండ బుచ్చయ్య కుమార్తె మహేశ్వరి. వ్యవసాయం, గొర్రెలు కాస్తూ తనతో పాటు ఇద్దరు చెల్లెల్లను చదివించారు. టీచరు ఉద్యోగం చేయాలన్నది నాన్న చిరకాల వాంఛ. పదో తరగతి వరకు అడ్డగూడూరు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశాను. ఇంటర్ మోత్కూరులో పూర్తిచేసి, హైదరాబాద్‌లో 2014లో టీటీసీ పూర్తిచేశాను. 2015లో వివాహం చేసుకున్న తర్వాత భర్త ప్రోత్సాహంతోనే టెట్ పరీక్ష రాశాను. ఎలాంటి కోచింగ్‌కు వెళ్లకుండా తన ఇద్దరు చిన్నపిల్లలను చూసుకుంటూ ఇంట్లోనే ఉంటూ పుస్తకాలు తెప్పించుకొని తీరిక దొరికినప్పుడు, రాత్రి సమయంలో చదివి మొదటి ప్రయత్నంలోనే టీచర్ కొలువు సాధించాను.

## నాడు ఎస్జీటీ...నేడు స్కూల్ అసిస్టెంట్...



భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణానికి చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు రచ్చ శ్యాంసుందర్ తాజా డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. యాదాద్రి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లంలో తొమ్మిదో ర్యాంకును సాధించి మరో ఉద్యోగాన్ని సాధించడం గమనార్హం. 2019 ఉద్యోగ నియామకాల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఎస్జీటీ ఆంగ్లంలో ఆయన మొదటి ర్యాంకును సాధించి ఉద్యోగం పొందారు. ప్రస్తుతం శ్యాంసుందర్ తుర్కపల్లి మండలం మాధాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు.

## ఏడుగురు ఉపాధ్యాయులుగా ఎంపిక

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: మండలానికి చెందిన ఏడుగురు డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కప్రాయిపల్లికి చెందిన పోరెండ్ల నర్మద స్కూల్ అసిస్టెంట్, తెలుగు పండిట్ విభాగంలో ఆత్మకూరుకు చెందిన మజ్జిగ బాలరాజు (9వ ర్యాంకు), మజ్జిగ మంజుల (12వ ర్యాంకు), ఎస్జీటీ విభాగంలో మండల కేంద్రానికి చెందిన మల్లం స్రవంతి, కూరెళ్ల గ్రామంలో గంగదారి ప్రశాంతి, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో పోతిరెడ్డిపల్లికి చెందిన జక్క సతీశ్, కొరటికల్‌కు చెందిన మోటె శారద ఉద్యోగాలు సాధించారు.

# సంక్షిప్త సమాచారం

**నియామకం.. వలిగొండ:** మండలంలోని వర్కట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న హనీఫ్ అహ్మద్ పీఆర్టీయూ(టీఎస్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మంగళవారం నియమితులయ్యారు.

**వైన్స్‌లో చోరీ.. ఆత్మకూరు(ఎం):** మండల కేంద్రంలోని సునీత వైన్స్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు వైన్స్ పైకప్పు రేకులు తొలగించి 13 (రెండు లీటర్ల) మద్యం బాటిళ్లు, రూ.15వేల నగదు, సీసీ కెమెరాల డీవీఆర్ ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.కృష్ణయ్య పేర్కొన్నారు.

**బీబీనగర్ ఠాణా సీఐ స్థాయికి పెంపు.. బీబీనగర్:** బీబీనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో స్థాయి ఎస్సై నుంచి సీఐకి పెంచుతూ సోమవారం రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. మునుపు ఈ స్టేషన్ ఎస్‌హెచ్‌వో(స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా ఎస్సై స్థాయి అధికారి వ్యవహరించే వారు. తాజా ఉత్తర్వులతో ఠాణా ఎస్‌హెచ్‌వోగా సీఐ స్థాయి అధికారి వ్యవహరించనున్నారు. భువనగిరి గ్రామీణ సీఐగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని బీబీనగర్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు.

**పరామర్శ.. ఆర్థికసాయం.. అడ్డగూడూరు:** మండలంలోని వెల్దేవిలో ఇటీవల పిల్లి సతీష్ అనారోగ్యంతో మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మంగళవారం చిత్రపటానికి పూలమాలలు వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిల్లి సతీష్ కుటుంబానికి గురుకుల పాఠశాలలో చదువుకున్న తోటి స్నేహితులు రూ.34వేల ఆర్థికసాయం అందజేశారు.

**రాష్ట్ర కార్యవర్గంలో చోటు.. రాజపేట:** పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో మండలంలో విధులు చేపడుతున్న పలువురు ఉపాధ్యాయులకు చోటు దక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా పారుపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.శశికుమార్, కుర్రారం బి.పరమేశ్, నెమిల ఎం.శ్రీనివాస్ రెడ్డిలతోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బేగంపేట కె.ప్రదీకన్నలు ఎన్నికయ్యారని మండల శాఖ అధ్యక్షుడు సంపతి సుబ్బరాజు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం పక్షాన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

**రామన్నపేట, న్యూస్‌టుడే:** పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో రామన్నపేట మండలానికి చెందిన చొల్లేటి రాజన్‌బాబు, జానీ అఫ్గాన్ సహాధ్యక్షులుగా, ఎం.అల్వాల్‌రెడ్డి ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. వీరిని ఆ సంఘం మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కైరోజు లింగాచారి, అబ్దుల్‌రహీం అభినందించారు.

**గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత కేసీఆర్‌దే.. గుండాల:** నాడు కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తిగా ధ్వంసమైందని అసత్య ప్రచారాలు చేసిన కాంగ్రెస్ నాయకులు నేడు మండలానికి గోదావరి జలాలు ఏ విధంగా వచ్చాయో ప్రజలకు చెప్పాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు మందడి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడ్డమీది పండరి, రాములు, తదితర నాయకులు పాల్గొన్నారు.

**బీఎస్పీ సూర్యాపేట జిల్లా ఇన్‌ఛార్జిగా కేబీ రాజు.. మోత్కూరు:** మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన కొంపెల్లి బాల్‌రాజును బీఎస్పీ సూర్యాపేట జిల్లా ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**'బతుకమ్మపై ప్రభుత్వానిది చిన్నచూపు'.. యాదగిరిగుట్ట పట్టణం:** ఆడపడుచులు అమితంగా ఇష్టపడే బతుకమ్మ పండుగపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు తోటకూరి అనురాధ మండిపడ్డారు. యాదగిరిగుట్టలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌన్సిలర్ మమత, నాయకురాలు స్వాతి, కమలమ్మ, అండాలు పాల్గొన్నారు.

**డీసీపీకి పితృవియోగం.. భువనగిరి నేరవిభాగం:** డీసీపీ రాజేష్‌చంద్రకు పితృవియోగం కల్గింది. ఆయన తండ్రి రాములు అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. సొంతూరు సంగారెడ్డిలో రాములు అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి మృతితో డీసీపీ సెలవులో ఉండటంతో రాచకొండ క్రైం డీసీపీ మదన్‌మోహన్‌కు ఇన్‌ఛార్జి డీసీపీగా బాధ్యతలు చేపట్టారు.

**రిపబ్లిక్ పరేడ్‌కు రామన్నపేట విద్యార్థి.. రామన్నపేట, న్యూస్‌టుడే:** మహారాష్ట్రలో వచ్చేనెల 12 నుంచి 21 వరకు జరుగనున్న రిపబ్లిక్ పరేడ్‌కు రామన్నపేట డిగ్రీ కళాశాల ఎంపీసీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న లింగస్వామి ఎంపికయ్యారు. ఎంజీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ ఎస్ మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన ఎంపికపోటీలలో లింగస్వామి ఎంపికయ్యారు. ఈమేరకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్‌ఖానం లింగస్వామిని అభినందించారు.

**సినిమాలు** భువనగిరి, న్యూస్‌టుడే: వసుంధర: దేవర భద్రాద్రి: శ్వాగ్